సాక్షి
విశాఖపట్నం
సోమవారం ׀ 12 ׀ జూన్ ׀ 2023



సాయంకాలం.. సాగరతీరం

కొమ్మాది: ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు సాగరతీరాన్ని ఆశ్రయించారు.



క్రేజీ బిర్యానీ..

8లో

కుండ బిర్యానీతో మొదలైన ట్రెండ్.. పొట్లం, బొంగు, బకెట్, స్టీల్ డబ్బా, స్టీల్ బిందె, కుక్కర్ బిర్యానీలంటూ దూసుకొస్తున్నాయి.



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో..

8లో

ప్రజల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్-23 లో ప్రథమ స్థానమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు మేయర్ హరివెంకటకుమారి తెలిపారు.

న్యూస్‌రీల్

మానసిక పరిపక్వతతో సమాజంలో మార్పు

ముగిసిన సనాతన ధర్మాలపై జాతీయ సదస్సు



సద్గురు శివానందర విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఎంవీపీ కాలనీ: ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియం భారతీయత–ద పాత్ ఆఫ్ అమృత్‌కాల్ అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో తొలిరోజు తెలంగాణ గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా పాల్గొన్న విషయం తెలిసిందే. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో భాగంగా సనాతన ధర్మాల విశిష్టత, భావితరాలకు అందించాల్సిన విజ్ఞానం అంశాలపై వక్తలు పలు సూచనలు చేశారు. ఆ దిశగా విజ్ఞాన వేత్తలు, పండితులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, కార్యాచరణపై చర్చించారు. వ్యక్తిగత క్రమశిక్షణలో మంచి నడవడికకు మూలమని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఎంఆర్ వెంకటేష్, ఎస్వీడీఎస్ రాజు, వీవీ హనుమంతరాజు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు



తాటిచెట్లపాలెం: ఇటీవల ఒడిశాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద దృష్ట్యా బహనగర బజార్ స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న ట్రాక్ నిర్వహణ పనుల నిమిత్తం ఆయా స్టేషన్‌ల్లో బయల్దేరాల్సిన పలు రైళ్లు రద్దయినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 13వ తేదీన షాలిమార్–విశాఖపట్నం(22853) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్, హౌరా–విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(22887) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్–చెన్నై (22825) ఎక్స్‌ప్రెస్, షాలిమార్–హైదరాబాద్(18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–షాలిమార్ (12774) ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–షాలిమార్ (18046) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విల్లుపురం –ఖరగ్‌పూర్(22604) ఎక్స్‌ప్రెస్, ఎర్నాకుళం –హౌరా (22878) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.


రేపు మినీ జాబ్ మేళా

కంచరపాలెం: ఊర్వశి కూడలిలోని గౌరీ డిగ్రీ–పీజీ కళాశాలలో ఈ నెల 13న మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, డాక్టర్ రెడ్డీస్ సంస్థలు మంగళవారం ఉదయం 9 గంటలకు 110 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసి 19 నుంచి 24 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు https://www.apssdc.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 98484 38254ను సంప్రదించాలని సూచించారు.

వడదెబ్బ బాధితులకు కేజీహెచ్‌లో ప్రత్యేక పడకలు

మహారాణిపేట: ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ బాధితుల సౌకర్యార్థం కేజీహెచ్‌లో ప్రత్యేక పడకలు కేటాయించారు. వడదెబ్బ బాధితులను ముందుగా క్యాజువాలిటీలో కేటాయించిన మూడు పడకల్లో చేర్చి చికిత్స అందిస్తారు. అనంతరం అక్కడి నుంచి రాజేంద్రప్రసాద్, భావనగర్ వార్డులకు తరలిస్తామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు.

13న సాయంత్రం 6 వరకే అప్పన్న దర్శనాలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామస్తుల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ పండగ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటల వరకే అప్పన్నస్వామి దర్శనాలు లభిస్తాయని దేవస్థానం ఏఈవో రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఈ నెల 14 ఉదయం 6.30 గంటల నుంచి యథావిధిగా స్వామి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

బడి పిలుస్తోంది రా..



ప్రకాశరావుపేటలోని జీవీఎంసీ పాఠశాల

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- ఎండల తీవ్రత దృష్ట్యా ఒంటి పూట బడులు
- ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం రాగి జావ, ఆ తరువాత మధ్యాహ్న భోజనం
- 19 నుంచి రెండు పూటలా బడులు

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు	611
విద్యార్థుల సంఖ్య	1,03,224
జిల్లాలోని ప్రైవేటు స్కూల్స్	774
విద్యార్థుల సంఖ్య	2,68,910
ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్లలోఉపాధ్యాయులు	3,543
ఎయిడెడ్ స్కూల్ ఉపాధ్యాయులు	169
ప్రైవేటు స్కూల్స్ ఉపాధ్యాయులు	7,728
మొత్తం ఉపాధ్యాయులు	11,271
నాడు–నేడు కింద రెండో విడతలో అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వ పాఠశాలలు	313
మంజూరైన నిధులు	రూ.133.41 కోట్లు
మొదట విడతలో జిల్లాలో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాలలు	165



విశాఖ విద్య: జిల్లాలోని పాఠశాలలు సోమవారం తెరుచుకోనున్నాయి. వేసవి సెలవులు అనంతరం 2023–24 విద్యా సంవత్సరం క్యాలెండర్‌కు అనుగుణంగా తరగతులు ప్రారంభం కానున్నాయి. అయితే ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ వర్గాల వారి నుంచి వచ్చిన విజ్ఞాపలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ నెల 17 వరకు ఒంటి పూట మాత్రమే పాఠశాలలు నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రతీ రోజూ ఉదయం 7.30 నుంచి 11.30 వరకు పాఠశాలలను నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో విద్యార్థులకు రాగిజావ అందజేయనున్నారు. 11.30 గంటల తరువాత మధ్యాహ్న భోజనం పెట్టి విద్యార్థులను ఇళ్లకు పంపించనున్నారు. ఈ నెల 19 నుంచి రెండు పూటలా పాఠశాలలను నిర్వహించాల్సి ఉంటుందని డీఈవో ఎల్.చంద్రకళ వెల్లడించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలలు ఇదే రీతిన పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అద్దంలా మెరుస్తున్న ప్రభుత్వ బడులు

నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు పెంపొందించటంతో ప్రభుత్వ పాఠశాలలు అద్దంలా మెరుస్తున్నాయి. జిల్లాలో తొలి దశలో 165 పాఠశాలలను అభివృద్ధి చేయగా, రెండో దశలో రూ.133.41 కోట్లతో 313 పాఠశాలల్లో పనులు చేపట్టారు. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి కావొచ్చాయి. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేసేలా సమగ్ర శిక్ష అభియాన్ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తొలిదశలో అభివృద్ధి చేసిన పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు అద్దంలా మెరుస్తూ, విద్యార్థులను రా రమ్మంటూ ఆహ్వానిస్తున్నాయి.

అడ్మిషన్లపై స్పెషల్ డ్రైవ్

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు సంఖ్య పెరిగేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా అంగన్వాడీల నుంచి వచ్చే పిల్లలంతా తప్పనిసరిగా ప్రభుత్వ స్కూళ్లలోనే చేరేలా ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అదే విధంగా ప్రైమరీ, యూపీఎస్‌ల నుంచి పై తరగతులకు వచ్చే విద్యార్థుల వివరాలను సేకరించి, వారిని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశించారు.

పాఠశాలలన్నీ తెరవాల్సిందే..



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని స్కూళ్లు సోమవారం నుంచి తెరవాలి. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాలల హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇచ్చాం. కొన్ని ప్రైవేటు స్కూళ్లు సెలవులు ఇంకొన్ని రోజులు పొడిగిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించే స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

అందుకో జగనన్న కానుక

- జిల్లాలో 87,413 మందికి ప్రయోజనం
- నేడు చిట్టివలసలో జిల్లాస్థాయి వేడుక



నెహ్రూబజార్ స్కూల్‌లో గల స్టాక్ పాయింట్ నుంచి విద్యాకానుక కిట్లను తరలిస్తున్న దృశ్యం



జగనన్న విద్యాకానుక కిట్లు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక అందించేందుకు అంతా సిద్ధమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోమవారం గుంటూరు జిల్లా క్రోసూరులో 'జగనన్న విద్యాకానుక'ను లాంఛనంగా పంపిణీ చేసిన అనంతరం.. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేయనున్నారు. జిల్లాలోని భీమిలి మండలం చిట్టివలస పాఠశాలలో జిల్లాస్థాయి వేడుక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా విద్యార్థులు వీక్షించనున్నారు. కాగా.. వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 611 పాఠశాలల్లో 87,413 మంది విద్యార్థులు జగనన్న విద్యాకానుక అందుకోనున్నారు. వీరిలో 42,101 బాలురు, 45,312 మంది బాలికలు ఉన్నారు.

కిట్‌లో ఎనిమిది రకాల వస్తువులు

విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్‌లో ఎనిమిది రకాల వస్తువులు ఉంటాయి. ఒక్కో విద్యార్థికి మూడు జతల యూనిఫాంలు, నోటు పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక బెల్టు, పాఠ్య పుస్తకాలతో పాటుగా బ్యాగును అందజేస్తారు. ఒకటి నుంచి 3వ తరగతి వరకు చిన్న సైజు, 4 నుంచి 6 వరకు మిడిల్ సైజు, 7 నుంచి 10 వరకు పెద్ద సైజు బ్యాగు ఇవ్వనున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా మండల, డివిజన్, జిల్లాస్థాయిలో అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

పక్కాగా పంపిణీ

కానుకలను పక్కాగా పంపిణీ చేసేలా దృష్టి సారించాం. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసేలా సరిపడా కిట్లను ఇప్పటికే సరఫరా చేశాం. జిల్లాకు పూర్తిస్థాయిలో విద్యాకానుక వస్తువులు సరఫరా చేశారు. స్టాక్ పాయింట్లలో అదనపు నిల్వలు కూడా అందుబాటులో ఉంటాయి. ఎక్కడైనా అవసరమైతే, సరఫరా చేసేలా తగిన చర్యలు చేపడతాం.

–శిరీషా రాణి, సీఎంవో, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా

'ఆణిముత్యాలు'కు ప్రోత్సాహం

- టెన్త్ టాపర్‌లకు నగదు పురస్కారం
- ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ముగ్గురికి నగదు అందజేత
- నేటి నుంచి 19 వరకు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు



నగదు బహుమతి అందుకోనున్న కేజీబీవీ విద్యార్థులు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్నిరకాలుగా తోడ్పాటు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, వారిలో మరింత పోటీతత్వాన్ని పెంచేలా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు'గా ప్రకటించి వారికి నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు ప్రకటించింది. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో టాప్‌లో నిలిచిన విద్యార్థులతో పాటు, ప్రతీ పాఠశాలలో మొదటి మూడు స్థానాలు దక్కించుకున్న విద్యార్థులకు సైతం నగదు పురస్కారాలు అందజేయనుంది. సోమవారం నుంచి ఈ నెల 19 వరకు ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని హైస్కూళ్లలో వేడుకలు నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. అలాగే ఈ నెల 15న నియోజకవర్గ స్థాయి, 17న జిల్లా స్థాయి, 20 రాష్ట్ర స్థాయిలో వేడుక నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో నగదు అందుకున్న విద్యార్థులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చూపినట్లయితే వారికి అదనపు నగదు పురస్కారం దక్కనుంది.

జిల్లాలో 108 మందికి నగదు పురస్కారం

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఏపీఆర్ఎస్–1, ప్రభుత్వ–6, కేజీబీవీ–3, ఏపీటీడబ్ల్యూఆర్–2, జెడ్పీ–9, బీసీ వెల్ఫేర్ –3, ఎయిడెడ్–10, మున్సిపల్–21, సోషల్ వెల్ఫేర్ పరిధిలోని 3 పాఠశాలల నుంచి ఈ ఏడాది 10,747 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 7,198 మంది విద్యార్థులు పాసయ్యారు. 62 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 4,632 మంది ఫస్ట్‌క్లాస్ మార్కులతో ఉత్తీర్ణత పొందారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఏకంగా 921 మంది 500లకు పైగా మార్కులు సాధించారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాలనే తలంపుతోనే ప్రభుత్వం ప్రతీ పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు పురస్కారం ఇవ్వాలని ఆదేశించింది. జిల్లాలో 108 మందికి నగదు పురస్కారం పంపిణీ కోసమని రూ.6.48 లక్షలు మంజూరయ్యాయి. సమగ్రశిక్ష అధికారులు ఈ డబ్బులను నేరుగా పాఠశాలల హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటీ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. విద్యార్థులను పాఠశాలలకు పిలిపించి ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల సమక్షంలో సత్కరించి నగదు పురస్కారం అందించాలని డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశించారు. ఈ విషయంలో పాఠశాలల హెచ్‌ఎంలు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

తొమ్మిదేళ్లలో ఎన్నో అద్భుతాలు

విశాఖ బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

సాక్షి, విశాఖపట్నం/ఎంవీపీ కాలనీ: ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన విజయోత్సవాల్లో భాగంగా విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. దీనికి మహాజన సంపర్క్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. అమిత్‌షా చెన్నై నుంచి సాయంత్రం ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి సభా వేదిక వద్దకు రాత్రి 7 గంటలకు వచ్చారు. తొలుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఐదు నిమిషాలు మాట్లాడారు. అనంతరం అమిత్‌షా 28 నిమిషాల సేపు ప్రసంగించారు. మధ్యలో పలుమార్లు భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అద్భుతాలు సృష్టించారని అమిత్ షా తెలిపారు. దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ అందిస్తున్న సహకారాన్ని తెలియజేసేందుకే ఈ బహిరంగ సభ నిర్వహించినట్లు తెలిపారు. అమిత్‌షా రాక ముందు బీజేపీ నేతలు సత్యకుమార్, పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు తదితరులు సభనుద్దేశించి మాట్లాడారు. అమిత్‌షా సభకు తొలుత 20 వేల మంది, ఆ తర్వాత 50 వేల మంది వస్తారని పార్టీ నాయకులు ముందుగా ప్రకటించారు. కానీ దానికంటే చాలా తక్కువ సంఖ్యలోనే జనం హాజరయ్యారు. అమిత్‌షా రాకకు ముందే పలువురు సభ నుంచి నిష్క్రమించారు. ఖాళీ అయిన కుర్చీల్లోకి జనాన్ని పంపాలని నిర్వాహకులు అభ్యర్థించినా ఫలితం లేకుండా పోయింది. అమిత్‌షా సభకు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా విశాఖకు ఎన్నో మేళ్లు చేకూర్చామని, అభివృద్ధి చేశామని చెప్పిన అమిత్‌షా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మాత్రం ఒక్క మాటా మాట్లాడలేదు. సభ ముగిశాక అమిత్‌షా పోర్టు సాగరమాలలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు మురళీధరన్, సునీల్ దియోధర్, మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, టీజీ వెంకటేష్, జీవీఎల్ నరసింహారావు, ముఖ్యనాయకులు ఆదినారాయణరెడ్డి, విష్ణుకుమార్‌రాజు, వాకాటి నారాయణరెడ్డి, సుహాసిని, సూర్యమోహన్, వైఎస్ చౌదరి, విశాఖ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బీజేపీ తీరని ద్రోహం

వామపక్షాల నిరసన ర్యాలీ



ఆశీలమెట్ట వద్ద ర్యాలీగా వస్తున్న వామపక్ష నేతలు

సీతమ్మధార: రాష్ట్ర ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందే కాకుండా.. విజయోత్సవ సభల పేరుతో మరో మారు మోసం చేసేందుకు సిద్ధమవుతున్న బీజేపీకి పాడె కట్టాలని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల నేతలు పిలుపునిచ్చారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటన నేపథ్యంలో ఆదివారం రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ విగ్రహం వరకు నల్ల జెండాలు, నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి ద్రోహం చేసిందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటామని అమిత్‌షా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఐస్ ఫ్యాక్టరీలకు వడదెబ్బ!

- ఉష్ణతీవ్రతతో తయారీకి జాప్యం
- టన్ను రూ.1,400 నుంచి 1,900కి పెంపు
- ఐస్ కొరతతో మత్స్యకారుల తీవ్ర ఇక్కట్లు



ఫిషింగ్ హార్బర్‌లో బోట్లలోకి ఐస్ వేస్తున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం: వేసవి తీవ్రత ప్రభావం ఐస్ తయారీపై పడింది. ఉష్ణోగ్రతల పెరుగుదలతో ఐస్ తయారీ ఆలస్యమవుతోంది. ఇది ఆయా తయారీ సంస్థలకు భారమవుతోంది. ఉత్పత్తి తగ్గడంతో కొరతకు దారితీస్తోంది. మరో మూడు రోజుల్లో చేపలవేటపై ఉన్న నిషేధం ముగుస్తుంది. 15వ తేదీ నుంచి వేట ప్రారంభమవుతుంది. వారం, పది రోజుల ముందు నుంచే బోటు యజమానులు ఐస్‌ను సిద్ధం చేసుకుంటారు. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 700కు పైగా మరపడవలు చేపలవేట సాగిస్తుంటాయి. వీటిలో 15 నుంచి 600 బోట్ల వరకు వేటకు సన్నద్ధమవుతున్నాయి. ఈ హార్బర్‌లో ఎనిమిది ఐస్ ఫ్యాక్టరీలున్నాయి. తగినంత ఉత్పత్తి జరగక ఇవి బోట్ల అవసరమైన మేర ఐస్‌ను సరఫరా చేయలేకపోతున్నాయి. ఒకసారి వేటకు వెళ్లడానికి బోటుకు 15 టన్నుల ఐస్ అవసరమవుతుంది. కానీ ప్రస్తుతం సగం ఐస్ కూడా లభ్యత ఉండడం లేదు. దీంతో 15వ తేదీ నుంచి తమ బోట్లను పూర్తి స్థాయిలో వేటకు సిద్ధం చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని మత్స్యకారులు చెబుతున్నారు. ఇప్పటికే ఈనెల 7 నుంచి వీరు ఐస్‌ను కొనుగోలు చేసుకుని భద్రపరచుకుంటున్నారు.

సమ్మర్ ఎఫెక్ట్ ఇలా..

ఐస్ తయారీకి అవసరమైన నీటి ఉష్ణోగ్రత 21–22 డిగ్రీల మధ్య ఉండాలి. అలా ఉంటే ఐస్ పూర్తి స్థాయిలో తయారవడానికి 40 గంటల సమయం పడుతుంది. అయితే పక్షం రోజులుగా వీస్తున్న వడగాడ్పులతో అది 35 డిగ్రీల వరకు చేరుకుంటోంది. దీంతో లోపల యంత్రాలకున్న కూలింగ్ తగ్గిపోతుండడం వల్ల ఇప్పుడా సమయం 50–55 గంటలు తీసుకుంటోంది. దీనికి విద్యుత్‌తో పాటు లేబర్, ఇతరత్రా వినియోగం అధికమవుతోంది. అలాగే ఐస్ తయారీలో వినియోగించే అమ్మోనియా, ఉప్పు ధర కూడా పెరిగింది. ఇది ఐస్ ఉత్పత్తికయ్యే ఖర్చును పెంచుతోంది. ఈ నేపథ్యంలో ఐస్ తయారీ సంస్థల యజమానులు ఐస్ రేటును పెంచారు. ఇప్పటివరకు టన్ను ఐస్ ధర రూ.1,400 ఉండగా తాజాగా దానిని రూ.1,900కి పెంపుదల చేశారు. ప్రస్తుతం 60 శాతం ఉత్పత్తికి మించడం కష్టమవుతోందని, దీంతో డిమాండ్ మేరకు ఐస్ సరఫరా చేయలేకపోతున్నామని ఫిషింగ్ హార్బర్‌లోని ఓ ఐస్ ఫ్యాక్టరీ యజమాని కర్రి నాగిరెడ్డి 'సాక్షి'కి చెప్పారు.

రాయితీ కోసం వినతి

మరోవైపు ఐస్ టన్నుకు రూ.500 పెరగడం తమకు ఆర్థికంగా భారంగా మారిందని బోటు యజమానులు అంటున్నారు. ఒక బోటు నెలకు రెండు సార్లు వేటకెళ్తే సగటున 25 టన్నుల ఐస్ అవసరమవుతుందని, ఈ లెక్కన ఒక్క ఐస్‌కే రూ.12 వేల వరకు వెచ్చించాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికే చేపలవేట గిట్టుబాటు కాని పరిస్థితుల్లో ఐస్ ధర పెరగడం మరింత భారమవుతుందని వీరు ఆవేదన చెందుతున్నారు. పూర్తి స్థాయిలో ఐస్‌ను సమకూర్చుకున్న బోట్లు 15 నుంచి వేటకు బయలుదేరతాయని, లేని బోట్లు ఈనెల 20వ తేదీ వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొంటున్నారు. పెరిగిన ఐస్ భారం బోటు యజమానులపై పడకుండా టన్నుకు రూ.వెయ్యి రాయితీ ఇప్పించాలని ప్రభుత్వానికి విన్నవించనున్నట్టు రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ 'సాక్షి'కి చెప్పారు.



అకేషన్ ఏదైనా.. లొకేషన్ ఎక్కడైనా.. తప్పనిసరి ఐటెమ్స్‌లో బిర్యానీ ఒకటి. ఫంక్షన్లలో దానికున్న క్రేజ్ అలాంటిది మరి. దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు, హోటళ్లలో అత్యధికులు ఆరగించే వంటకాల్లో బిర్యానీదే అగ్రస్థానం. ఆన్‌లైన్ ఆర్డర్లలో కూడా బిర్యానీదే హవా.. గల్లీ నుంచి స్టార్ హోటళ్ల వరకు కొత్త కొత్త పేర్లు.. ఫ్లేవర్లతో భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కుండ బిర్యానీతో మొదలైన ఈ ట్రెండ్.. పొట్లం, బొంగు, బకెట్, స్టీల్ డబ్బా, స్టీల్ బిందె, కుక్కర్ బిర్యానీలంటూ మార్కెట్‌లోకి దూసుకొస్తున్నాయి. ఈ ప్రయత్నం ఫలిస్తుండటంతో.. ట్రెండ్‌కు తగ్గట్టు హోటళ్ల నిర్వాహకులు కొత్త ఆలోచనలకు పదును పెడుతున్నారు.

–విశాఖపట్నం డెస్క్

క్రేజీ బిర్యానీ..



- వెరైటీ చికెన్ బిర్యానీలకు కేరాఫ్ విశాఖ
- కస్టమర్లను ఆకర్షించేందుకు కొత్త పుంతలు
- బకెట్, డబ్బా, బిందె, కుక్కర్లలో ప్యాకింగ్
- ఆసక్తి చూపుతున్న ఫుడ్ లవర్స్

'మీ ఫేవరేట్ ఫుడ్ ఏంటి?' అని ఎవరినైనా అడిగి చూడండి. ఎక్కువ మంది ఇచ్చే సమాధానం బిర్యానీ. ఆ వాసనకే నోరూరిపోతుంది. బిర్యానీ మంచి పోషకాహారం.. రుచికరమైనది. మొఘలులు మనకిచ్చిన అద్భుత బహుమతి బిర్యానీ అని చెప్పుకోవచ్చు. అప్పట్లో సైనికుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రత్యేకంగా తయారు చేయించిన ఈ బిర్యానీ.. ఇప్పుడు రైస్ డిష్‌ల్లో రారాజుగా వెలుగొందుతోంది.

విశాఖలో బిర్యానీ రుచులు

హైదరాబాద్ బిర్యానీ అంటే చాలా ఇష్టమని.. తాను ఎప్పుడు నగరానికి వచ్చినా తినకుండా వెళ్లనని ఓ సందర్భంలో క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ చెప్పారు. హైదరాబాద్ దమ్ బిర్యానీ స్థాయి రుచితో గ్రేటర్ విశాఖ వెరైటీ బిర్యానీలకు చిరునామాగా మారింది. నగరంలో నేడు ఎక్కడ చూసినా రెస్టారెంట్లు, హోటళ్లు దర్శనమిస్తున్నాయి. వాటిల్లో కొత్త కొత్త రకాల బిర్యానీలు లభిస్తున్నాయి. వైజాగ్ ఫుడ్ లవర్స్‌ను ఆకట్టుకునేందుకు నిర్వాహకులు రకరకాల చికెన్ బిర్యానీలను తయారు చేసి డిఫరెంట్ ప్యాకింగ్‌లలో అందజేస్తున్నారు.

టేక్‌ఎవేకు డిమాండ్..

ట్రెండ్‌కు తగ్గట్టు డిఫరెంట్ టేస్టీ బిర్యానీలను విశాఖలో విక్రయిస్తున్నారు. వాటి ధరలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. స్టీల్ బిందె, స్టీల్ డబ్బా, గ్రీన్ బకెట్, బ్లూ బకెట్, బ్లాక్ బకెట్, రెడ్ బకెట్ వంటి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో విక్రయాలు ఊపందుకున్నాయి. ఎంత మంది.. ఎంత ధరో చెబితే.. కుండ, బకెట్, డబ్బాల సైజులను ఎంపిక చేసి.. పార్సిల్ చేసి ఇస్తున్నారు. బిర్యానీని ఆరగించాక బిందె, డబ్బా, కుక్కర్‌లను వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతుండటంతో.. ఈ తరహా విక్రయాలకు డిమాండ్ పెరిగింది. నగరంలో లభిస్తున్న వివిధ రకాల బిర్యానీల్లో కొన్నింటి విశేషాలేంటో తెలుసుకుందాం.



బిర్యానీల్లో కొన్ని వెరైటీలు..



కుండ బిర్యానీ: మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ, హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట, శాంతిపురం, ఎంవీపీ కాలనీ, ద్వారకానగర్, నైట్ ఫుడ్‌కోర్టు, జగదాంబ సెంటర్, ఎన్‌ఏడీ, గాజువాక ప్రాంతాల్లో లభిస్తుంది. కుండ సైజ్, రెస్టారెంట్‌ను బట్టి ధర ఉంటుంది.రూ.300 నుంచి ప్రారంభమవుతుంది.

బకెట్ బిర్యానీ: ఇసుకతోట జంక్షన్, ఆరిలోవ, రామాటాకీస్, ఎన్‌ఏడీ జంక్షన్, గాజువాక ప్రాంతాల్లో లభిస్తుంది. రూ.199 నుంచి ధర మొదలవుతుంది.

స్టీల్ డబ్బా, బిందె, కుక్కర్ బిర్యానీ: వెంకోజీపాలెం రెస్టారెంట్‌లో లభిస్తుంది. స్టీల్ డబ్బా బిర్యానీ నాలుగు సైజుల్లో దొరుకుతుంది. ఇద్దరికి సరిపోతుంది. ధర రూ.290. నలుగురికి రూ.590, ఆరు నుంచి ఏడుగురికి రూ.790, 12 నుంచి 14 మందికి సరిపోయేది రూ.1,999. డైలీ 300 నుంచి 400 స్టీల్ డబ్బా బిర్యానీలు విక్రయిస్తున్నారు. స్టీల్ బిందె చిన్నది రూ.1,000. 15 మందికి సరిపోయే బిందె బిర్యానీ రూ.2,500గా విక్రయిస్తున్నారు. స్టీల్ కుక్కర్ బిర్యానీ రూ.3,500. 10 లీటర్ల సామర్థ్యం గల కుక్కర్ బిర్యానీ 15 మందికి సరిపోతుంది.

పొట్లం బిర్యానీ: మద్దిలపాలెం పిఠాపురం కాలనీ, ద్వారకానగర్, ఎన్‌ఏడీ జంక్షన్, వైజాగ్ బీచ్ రోడ్డులోని రెస్టారెంట్లు, హోటళ్లలో లభిస్తుంది. రూ.320 నుంచి ప్రారంభమవుతుంది.

చికెన్ దొన్నె బిర్యానీ: విశాలాక్షి నగర్, జోడుగుళ్లపాలెం, పాత గాజువాకలో లభిస్తుంది. రెస్టారెంట్లను బట్టి రూ.300 నుంచి ధర ప్రారంభమవుతుంది. డిఫరెంట్ దొన్నె బిర్యానీలు అందుబాటులో ఉన్నాయి. చిట్టి ముత్యాలు రైస్‌తో చేస్తారు.

బొంగులో చికెన్ బిర్యానీ: వైజాగ్ బీచ్ రోడ్, గోపాలపట్నంలో లభిస్తుంది. రెస్టారెంట్‌ను బట్టి రూ.300 నుంచి ప్రారంభమవుతుంది. బొంగులో చికెన్ బిర్యానీకి అరకు బాగా ఫేమస్. నగరంలోని కొన్ని రెస్టారెంట్లలో ప్రత్యేకంగా తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఐ లవ్ బిర్యానీ



బిర్యానీ అంటే నాకు చాలా ఇష్టం. దాని ఫ్లేవర్, రూపు నన్ను ఇట్టే ఆకర్షిస్తుంది. చికెన్ బోన్‌లెస్ బిర్యానీని ఇష్టంగా తింటాను. ఇప్పుడు రకరకాల బిర్యానీలు వచ్చాయి. బకెట్ బిర్యానీ, బిందె బిర్యానీ, స్టీల్ బాక్సుల బిర్యానీ అంటూ కొత్తకొత్తవి తయారు చేస్తున్నారు. మేం అన్నీ ట్రైం చేస్తున్నాం.

– డి.హేమలలిత, ఏయూ విద్యార్థిని, మద్దిలపాలెం

ఇష్టమైన ఫుడ్ బిర్యానీ



చిన్నప్పటి నుంచి బిర్యానీ అంటే నాకు చాలా ఇష్టం. నగరంలోని అన్ని రెస్టారెంట్లకు వెళ్లి బిర్యానీ టేస్ట్ చేశాను. స్నేహితులంతా కలిసి బిర్యానీ పార్టీలు చేసుకుంటూ ఎంజాయ్ చేస్తాం. ఇష్టమైన ఫుడ్ తింటే వచ్చే ఆ సంతృప్తి వేరు.

– డి.హారిక, మెడికో, మద్దిలపాలెం



కస్టమర్ల సంతృప్తే ముఖ్యం



నేను వైద్యుడిని.. ఫుడ్ ఇండస్ట్రీ మీద మక్కువతో మా అమ్మ పేరు పద్మావతికి గుర్తుగా వెంకోజీపాలెంలో రెస్టారెంట్‌ను ప్రారంభించాం. ట్రెండ్‌కు తగ్గట్టుగా ఆరు నెలల కిందట స్టీల్ డబ్బా, స్టీల్ బిందె, స్టీల్ కుక్కర్ బిర్యానీ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చాం. కస్టమర్ల నుంచి మంచి స్పందన వచ్చింది. బిర్యానీ పార్సిల్‌తోపాటు స్టీల్ డబ్బా, బిందె, కుక్కర్లను ఉచితంగా అందిస్తున్నాం. ఈ నెలాఖరు నుంచి అడల్ట్ బిర్యానీని పరిచయం చేయబోతున్నాం.

– డాక్టర్ ఎస్.మోహన్, రెస్టారెంట్ యజమాని

పొన్నం.. ఫేమస్ ఫర్ పొట్లం



కుకింగ్‌లో నాకు 20 ఏళ్ల అనుభవం ఉంది. కస్టమర్ల అభిరుచికి తగ్గట్టు చికెన్, మటన్, రొయ్యల బిర్యానీలు అందిస్తున్నాం. మా దగ్గర పొట్లం బిర్యానీ, కుండ బిర్యానీలను పిల్లలు, మహిళలు ఇష్టంగా తింటారు. రెండేళ్ల కిందట మా అబ్బాయికి కమ్మనైన బిర్యానీ అందివ్వడం కోసం తయారు చేసిన పొట్లం బిర్యానీ.. నేడు బాగా ఫేమస్ అయింది. కస్టమర్లకు ప్రతి బిర్యానీతో పాటు చక్రపొంగలిని ఉచితంగా అందిస్తున్నాం.

– పొన్నం సతీష్, నిర్వాహకుడు, సదరన్ ఫుడ్స్





బొంతుపేట వద్ద రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి ఫ్లైఓవర్‌పై కారు పల్టీ
- తెరచుకున్న ఎయిర్ బెలూన్లు
- ఆరుగురికి స్వల్ప గాయాలు

లావేరు: బొంతుపేట గ్రామం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్ పైనుంచి వెళుతున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. కారు నుజ్జునుజ్జయినప్పటికీ ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నానికి చెందిన వై.కుమార్‌తో పాటు మరో ఐదుగురు ఆదివారం ఉదయం కారులో ఒడిశా రాష్ట్రంలోని బరంపురం వద్ద చత్రపురి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం సమయంలో విశాఖ వెళ్లే క్రమంలో బొంతుపేట గ్రామం వద్ద ఫ్లైఓవర్ పైనుంచి వెళుతుండగా కారు అదుపుతప్పి జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి అవతలి రోడ్డులో పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఆ మార్గంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వై.కుమార్‌కు చేతిపై గాయమవ్వగా మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. లావేరు పోలీసులు ప్రమాద స్థలానికి వచ్చి కారును పరిశీలించి వివరాలు సేకరించారు.

ఘనంగా ముత్తంశెట్టి జన్మదిన వేడుకలు


ముత్తంశెట్టి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ, పంచర్ల, తదితరులు

కొమ్మాది(భీమిలి): మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు 4వ వార్డు చిలుకూరి లేఅవుట్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తల సమక్షంలో ముత్తంశెట్టి కేక్ కట్ చేశారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ప్రముఖ ఆడిటర్ జీవీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పాలిసెట్ విద్యార్థులకు నేటి నుంచి ఓరియంటేషన్ తరగతులు

మురళీనగర్(విశాఖ ఉత్తర): పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులకు సోమవారం నుంచి ఓరియంటేషన్ తరగతులు నిర్వహించనున్నట్టు పాలిటెక్నిక్ ప్రవేశాల రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 24వ తేదీ వరకు ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు తమ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్లి పేర్లు నమోదు చేసుకుని తరగతులకు హాజరు కావాలని ఆయన సూచించారు.

విమానం ఆలస్యంతో ఇక్కట్లు

గోపాలపట్నం : ముంబయి నుంచి విశాఖకు ఆదివారం సాయంత్రం 4 గంటలకు రావాల్సిన ఎయిరిండియా విమానం సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఈ విమానం సోమవారం రాత్రి 2 గంటలకు వచ్చి 2.40 గంటలకు ముంబయి బయలుదేరుతుందని ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. అంతవరకు ప్రయాణికులకు విమానాయన సంస్థ తగిన ఏర్పాట్లు చేసింది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానమే లక్ష్యం

- మేయర్ హరివెంకటకుమారి
- ఆర్కే బీచ్‌లో ఎకో వైజాగ్–1కే వాక్



1కే వాక్‌లో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

బీచ్ రోడ్డు: నగర ప్రజల సహకారంతో స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో ప్రథమ స్థానమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎకో వైజాగ్–1కే వాక్‌ను ఆదివారం ఆమె ఆర్కే బీచ్ వద్ద ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్–2022లో విశాఖ నగరం నాలుగో స్థానంలో నిలిచిందని, ఈ ఏడాది మొదటి స్థానం సాధించేలా సహకరించాలన్నారు. ఇప్పటికే నగర స్వచ్ఛతకు జీవీఎంసీ యంత్రాంగం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. స్వచ్ఛభారత్ అంబాసిడర్లు, స్వచ్ఛంద సంస్థలు కూడా నగర పరిశుభ్రతకు పాటు పడాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నగరంలో పూర్తిగా నిషేధించాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, ప్రత్యామ్నాయ వస్తువులైన క్లాత్ బ్యాగులను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ శ్రీధర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండ


ఆవుపై కప్పిన తడిపిన గోనెలు, దుస్తులు


జాగ్రత్తలతో ఎండలో ప్రయాణం

విశాఖ నిప్పుల కుంపటిలా మారిపోయింది. భానుడు తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణంలో తేమ శాతం లేకపోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉండటంతో జనం బయటకు రావాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ఎండ తీవ్రత తాళలేక మూగజీవాలు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. జీవీఎంసీ 35వ వార్డు పాత బస్‌స్టాండ్ సమీపంలో ఓ ఆవు ఎండకు ఊపిరి తీసుకోలేక ఇబ్బందులు పడుతుంటే స్థానికులు గమనించారు. ఆవుకు నీళ్లు తాగించి.. తర్వాత దానిపై తడిపిన గోనె, దుస్తులు కప్పారు. నీడపట్టుకు తీసుకెళ్లారు. సుమారు గంట తర్వాత ఆవు సాధారణ స్థితికి చేరుకుంది. కాగా.. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని.. బయటకు వచ్చే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జగదాంబ జంక్షన్ ప్రాంతంలో ఆదివారం ఉదయం కాసేపు వర్షం కురిసి.. ఆ ప్రాంత వాసులకు ఉపశమనం కలిగించింది.

– జగదాంబ

యువకుడి దారుణ హత్య?

- కాలువలో పూర్తిగా కాలిపోయిన యువకుడి మృతదేహం లభ్యం
- 68వ వార్డులో కలకలం రేపిన ఘటన
- ఎక్కడో చంపేసి.. ఇక్కడ దహనం చేసి ఉంటారని పోలీసుల అనుమానం


శివ(ఫైల్)


గుమిగూడిన జనం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం, సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: పూర్తిగా కాలిపోయిన ఓ యువకుడి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. జీవీఎంసీ 68వ వార్డు కాళికా నగర్, మింది పంప్ హౌస్ ఎదురుగా గల ఎ–బ్లాక్ జినిత్ ఇంజినీరింగ్ కంపెనీ పక్కన ఆదివారం ఈ ఘటన వెలుగు చూసింది. ఈ కేసుకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివీ.. గుడివాడ అప్పన్నకాలనీలో పంప్ హౌస్ వైపు కొందరు బాలురు ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడుతున్నారు. బ్యాటర్ కొట్టిన బంతి జినిత్ కంపెనీ గోడ పక్కనున్న కాలువలో పడింది. బాలు తీసుకోవడానికి ఓ బాలుడు కాలువలో దిగాడు. నీరు లేని నాలుగు అడుగుల పైనే లోతు ఉన్న కాలువలో పూర్తి కాలిపోయిన ఓ శవం చూసి భయాందోళన చెందాడు. ఈ విషయాన్ని వెంటనే స్థానికులకు చెప్పాడు. స్థానికులు గాజువాక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. సీఐ ఎల్.భాస్కరరావు, ఎస్ఐ కొల్లి సతీష్, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కాలువలో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. శవం యువకుడిదిగా గుర్తించి.. అతని వయసు 25 ఏళ్లు ఉంటాయని అంచనాకు వచ్చారు. అయితే ఆ మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. కాగా.. మృతదేహం లభ్యమైన ప్రాంతానికి కొద్ది దూరంలో దల్లి శివకు చెందిన ఆటో పార్కింగ్ చేసి ఉండటాన్ని గుర్తించారు. మృతదేహం శివది అయి ఉండొచ్చనే కోణంలో విచారణ ప్రారంభించారు. అదే సమయంలో గుడివాడ అప్పన్నకాలనీలో నివాసం ఉంటున్న దల్లి రమణారెడ్డి అక్కడకు చేరుకున్నారు. ఆ మృతదేహం తన కుమారుడు దల్లి శివ(25)దే అని అనుమానం వ్యక్తం చేయగా.. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించమన్నారు. చీకట్లో ఆ మృతదేహాన్ని అతను పూర్తిగా గుర్తుపట్టలేకపోయారు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకెళ్లిన తన కుమారుడు ఇంత వరకు రాలేదని, రెండు ఫోన్లు స్విచ్చాఫ్ అయి ఉన్నాయని తెలిపారు. పలు వివరాల సేకరణ అనంతరం ఆ మృతదేహం దల్లి శివదే అని పోలీసులు అంచనాకు వచ్చారు.

దల్లి శివ ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద గల రొయ్యల కంపెనీలో పనిచేస్తుంటాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. తల్లి ఆదిలక్ష్మి, సోదరి ఉన్నారు. ఖాళీ సమయంలో సొంత ఆటో నడుపుతుంటాడని అతని తండ్రి రమణారెడ్డి తెలిపారు. ఆటోను ఇంటి వద్దనే పార్కింగ్ చేస్తుంటాడని, రాత్రి కచ్చితంగా ఇంటికి వచ్చేస్తుంటాడని చెప్పారు. శివకు ఎలాంటి చెడు అలవాట్లు లేవన్నారు. కాగా.. ఈ కుటుంబం ఉపాధి నిమిత్తం 2006లో పాయకరావుపేట నుంచి వచ్చి గుడివాడ అప్పన్న కాలనీకి వలస వచ్చినట్టు స్థానికులు తెలిపారు.

అన్ని కోణాల్లో విచారణ

సంఘటన జరిగిన స్థలానికి కొద్ది దూరంలో సీసీ ఫుటేజ్ పోలీసులకు లభ్యమైంది. అర్ధరాత్రి 1.30 తర్వాత సంఘటన స్థలం వద్ద ఆటో ఆగినట్టు రికార్డ్ అయింది. ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్లి కొద్ది దూరంలో చేతులు కడుక్కోవడం ఫుటేజ్‌లో కనిపించింది. అక్కడే మరో వ్యక్తి కూర్చొని ఉన్నాడు. స్థానికంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనను ఛేదించడానికి పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. వివిధ కోణాల్లో విచారణ జరిపారు. యువకుడిని హత్య చేసి.. ఇక్కడకు తీసుకొచ్చి దహనం చేసి ఉంటారా? అతని కుటుంబ నేపథ్యం, స్నేహితులు, తదితర వివరాలు సేకరిస్తున్నారు. సీఐ ఎల్.భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.